# క్రీనీడ

సంధ్య చీకట్లు మెల్లిగా నలువేపులా అలుముకుంటు న్నాయి. లాంతరు కమ్మీకి తగిలించి నమస్కరిస్తూ, తలెత్తి చూచింది పార్వతి. విశ్వనాథం విసురుగా తడిక తోసుకుని వస్తున్నాడు. భర్తవాలకాన్ని బట్టే గ్రహించగల్గింది—వెళ్లిన పని కాలేదని. పై కండువా విసురుగా కుర్చీచేతిమీద పడేసి మడతకుర్చీలో వెనక్కు జేరగిలబడ్డాడు విశ్వనాథం.

మరచెంబుతో మంచినీళ్ళు తెచ్చిన భార్య చేతిలో గ్లాసందుకుంటూ అడిగాడు విశ్వనాథం "పిల్లలేరీ ?" అంటూ.

"పెద్దవాడు అట్లా చేలోకి పిల్చికెళ్ళాడు మిగతా ఇద్దర్నీ..."

ఇక ఎలా సంభాషణ కొనసాగించాలో తోచలేదామెకు...అయినా ధైర్యం చేసి అడిగింది "బావగారూ, అక్కయ్య, పిల్లలూ బాగున్నారా ?"

"ఆ! లక్షలకు లక్షలు లాభాలు గడిస్తూ, బొజ్జలు పెంచుకుని లక్షణంగా ఉన్నారు..."

భర్త కంఠస్వరంలో ఇంత కోపాన్ని ఏనాడూ చవిచూడలేదామె. అందులోనూ! ఆయన తోబుట్టువుల విషయంలో !

"బావగారేమన్నారు ?" మెల్లిగా అడిగింది.

"ఏమంటాడు ? లేదు పొమ్మన్నాడు. అందుకు అరలక్షకారణాలు చెప్పాడు."

"అక్కయ్య ?"

"ఒదినా ? మా ఒదినా ? లక్షమ్మొదినా ?" వత్తి వత్తి పలికాడు విశ్వనాథం.

విస్మయంగా చూచింది పార్వతి. భర్తకు తనడిగిన మాటలో అంత ఆశ్చర్యం ఎందుకు కలిగిందో అర్థం కాలేదు.

"ఆవిడ కూడా ఓ ఆడదనేనా నీ భావం ? కాదు కాదు. కృతఘ్నతకూ, స్వార్థపరత్వానికీ మారు పేరంటూ ఏదైనా ఉంటే ఆవిడే ?"

"ఛ. ఛ. అలా అనకండి...ఎంతైనా ఆవిడ ఈ ఇంటి పెద్దకోడలు..."

నాలిక్కర్చుకున్నాడు...తలెత్తి భార్య వేపు చూచాడు విశ్వనాథం.

గుమ్మానికానుకుని కూర్చుని ఉన్నది పార్వతి. తెల్లని మెడలో నల్లపూసలు, పసుపు మంగళసూత్రపుత్రాడు తప్ప మరే ఆభరణాలూ లేవు ! కట్టుకున్న చీరెకూడ మాతకది ! తమ దారిద్ర్యానికి ఉదాహరణలా ఉంది ! ఒకప్పుడు ... ఈ విగ్రహంలోనే ఎంత మార్పుండేది ! తెల్లని నుదురుమీద పెద్ద కుంకుమ బొట్టు ఎరుపుదనంతో పోటీపడుతూ, మెడలోని కెంపుల అడ్డిగ మెరుస్తుండేది ! ఆమె శరీరపు రంగులో, తన విలువ తగ్గుతుందనే భయంతో పట్టెడ వెలవెల బోయేది.

కనీసం ఆమె చేతుల కంటిపెట్టుకుఉన్నా, మా జన్మ తరిస్తుందన్నట్లు వంకీలూ, గాజులూ, చేతులకు మెరుస్తూండేవి. మూడు పేటల చంద్రహారం మెళ్లో వెలుగుతూండేది.

ఎన్నిమార్లో తననుకున్నాడు. "సాక్షాత్తు మహాలక్ష్మిలా ఉన్నావు పార్వతీ!" అని అన్నాడు కూడా.

తన చేజేతులా ఈనాడిలాటిస్థితి తెచ్చిపెట్టాడు.

గాఢంగా నిట్టూర్చిన భర్తవేపు చూస్తూ "ఏమిటి ?" అంది పార్వతి.

"ఆ నాడు...సరిగ్గా పదేళ్ళక్రితం...నువ్వు చిన్నవాణ్ణి కడుపుతో ఉన్నావు ... నీకు గుర్తుందా పార్వతీ ?" గత స్మృతులు తొలుచుకుంటూ పోతూ, శూన్యంలోకి చూస్తూ ప్రశ్నించాడు...

"ఆ! ఉంది !" భర్త చెప్పబోయేదేదో తనకూ తెలుసు. అయినా, తనకూ జ్ఞాపకాల తెరలు తొలగి పోతున్నాయి. ఇద్దరి ఆలోచనలూ ఒకే మార్గాన పరుగెడుతున్నాయి.

ఆ రోజు...

"విశ్వం, ఆపద ముంచుకొచ్చింది. ఆఫీసు డబ్బు నాలుగువేలు వాడుకున్నాను. నాలుగురోజుల్లో అది చెల్లించకపోతే! నన్ను జైల్లో వేస్తారు. తమ్ముడూ! ఇక ఆ తర్వాత నేను బ్రతికినా చచ్చినా ఒకటే. ఇక నీ ఇష్టం...

నీ అన్నయ్య
జగన్నాథం"

ఉత్తరం చదువుతూనే కంపించి పోయాడు విశ్వనాథం. కంగారుగా లోపలికి పరుగెత్తాడు.

తులసికోటలో సంధ్య దీపం వెలిగించి భారంగా మెల్లిగా ప్రదక్షిణ చేస్తోంది పార్వతి. తలకు పోసుకుని వదులుగా వేసుకున్న ముడిలో రెండు మందారపూలు, వంటినిండా నగలూ, కనకాంబరం రంగులో జరీనేత చీరె, అదేరంగు రవిక ధరించి, సాక్షాత్తు మహాలక్ష్మిలా ఉంది పార్వతి. మరో సమయంలో అయితే, అల్లాగే నిల్చుని ఎంతసేపో మంగళమూర్తిని వీక్షిస్తుండేవాడో విశ్వనాథం! కానీ ఈ నిమిషంలో అలాటి వూహకూడా లేదతనికి !

"పార్వతీ! అన్నయ్య దగ్గర్నించి జాబొచ్చింది...ఏం చేద్దాం ? నాకేం తోచటంలేదు సుమా !"

భర్త కంగారుచూచి భయపడిందామె......సంగతేమిటో తెల్సుకుని నిశ్చేష్టురాలైంది !

"కోతలేనా కాలేదు. పొట్టమీదుంది వరి ! కనీసం ధాన్యం అమ్మి సర్దుబాటు చేద్దామన్నా మార్గంలేదు...... రొక్కమూ ఐదారువందలకంటె ఎక్కువ లేదామె!......ఆ! ఒక్కటే ఉపాయం తోస్తోంది. ఈ ఏడు బీడుపెట్టిన ఆ రెండెకరాలు అమ్మేస్తాను......ఆపద తొలిగితే అంతే చాలు !" తనలో తను గొణుక్కుని నిర్ణయాని కొచ్చేశాడు......

"ఇప్పటి కిప్పుడు అమ్మితే ధర వస్తుందా ?" పార్వతి సందేహం విశ్వనాథానికి చిరాకు కలిగించింది.

"ఇక ఎప్పుడో అమ్మి ప్రయోజన మేముంది ?" భర్త మాటలు వీధి గుమ్మాని కవతలగా విన్పించాయి. తులసి తల్లికి నమస్కరించి ప్రదక్షిణాలు పూర్తిచెయ్యకుండానే లోపలికి నడిచింది నిండుచూలాలు పార్వతి !

పార్వతి సందేహించినంతా అయింది. రెండెకరాలూ మూడు వేలు పలికేసరికి కనాకష్టమయింది !

"బ్రతికుంటే వెధవ రెండెకరాల భూమి సంపాదించుకో లేక పోతామా ? ఒక తల్లిరక్తం పంచుకుపుట్టిన మాలో అన్నయ్య కవమానం జరిగితే ఒకటే, నాకయితే ఒకటేనా పార్వతీ ?" పిల్లలిద్దరికీ అన్నం కలిపి పెడ్తున్న పార్వతి తల పంకించింది భర్తకు ధైర్యం కలిగిస్తూ !

మి\తా వెయ్యి రూపాయలూ, రూపాయిన్నర వడ్డీకి పుట్టుకొచ్చాయి !

"విశ్వం ! నీ మేలు జన్మజన్మాలకూ మర్చిపోలేనురా !" చేతులు పట్టుకుని, చూపుల్లో కృతజ్ఞత వర్షిస్తుంటే జగన్నాథం అంటూన్నమాటలకు ఏమిటో సిగ్గుపడిపోయాడు విశ్వనాథం.

"మరిదీ! నా కుటుంబాన్నీ, నా పసుపు కుంకుమా నిల బెట్టావయ్యా ! చిన్నవాడివయినా చెయ్యెత్తి దణ్ణం పెట్టాలని పిస్తోంది నాయనా !" అంది లక్షుమ్మ వదిన !

"ఛ. ఛ. అలా అనకమ్మా ! ఇదేమంత గొప్పపనీ ?" అన్నాడు విశ్వనాథం కుంచించుకుపోతూ.

20

ఆనందంతో ఊరికి తిరిగి వస్తూనే, మాగాణికేసి వెళ్ళాడు! ఆ దృశ్యం చూచి కొయ్యబారి పోయాడు విశ్వనాథం!

వెళ్ళేసరికి నిండు గర్భవతిలా భారంగా పండివుంది మొన్న! అలాంటిది! ఎప్పుడు కురిసిందో పాపిష్టివాన, కయ్యలు నీళ్ళతో నిండివున్నాయి. గింజలన్నీ రాలి, వెన్నులు నీళ్ళ మీద తేలాడుతున్నాయి!

తనలానే రోదిస్తున్నారు సాటి రైతులు కయ్యల గట్ల మీద నిలబడి!

"విశ్వనాథయ్యా! అన్యాయం చేసిందయ్యా పాపిష్టి వాన! పిల్లదాని పెళ్ళి కుదుర్చుకున్నాను...కుర్రాణ్ణి పట్నం పంపిద్దామనుకున్నాను పై చదువులకు......అప్పు తీర్చు కుందామనుకున్నాను. కొంప ముంచింది బాబోయ్!"

ఇలాగే రకరకాలుగా గొంతులు చుట్టూరా రోదిస్తు న్నాయి! తనెవరితో చెప్పుకుంటాడు? చెల్లెలి పెళ్ళిచేసి ఏడాది తిరగలేదు. ఆ అప్పు నాలుగువేలలో, పంటరాగానే అమ్మి, సగానికి పైగా తీరుద్దామనుకున్నాడు తను! కానీ... కానీ......ఏటి పొడుగునా జరిగిన సేద్యం? కమతగాళ్ళకు గింజలు? తన కుటుంబానికి భుక్తి? హే భగవాన్! ఇల్లు జేరిన విశ్వనాథం మూడురోజులు జ్వరంతో ఒళ్లు తెలియకుండా పడిపోయాడు!

మెల్లిగా పార్వతి ధైర్యం ఇస్తూంటే, ఆమె పసుపు కుంకుమలకుగానూ, వాళ్ళ పుట్టింటివాళ్ళిచ్చిన రెండెకరాల్లో

వచ్చిన పాలిగింజల సాయంతో కోలుకుని మనిషి కాగలిగాడు ఎలాగో !

మూడేళ్లు గిర్రున తిరిగాయి! ఉద్యోగం మానేసి జగన్నాథం వ్యాపారంలోకి దిగాడు. వాడి తల వీడికీ, వీడి జుట్టు ముడి వాడికీ పెట్టి లక్షలార్జించాడు! మొదట్లో కృతజ్ఞతలు కురిపిస్తూ సానుభూతి వర్షిస్తూ, తనకై చేసిన అప్పూ, అమ్మిన భూమీ తానే ఇస్తానంటూ వ్రాసిన ఉత్తరాలు క్రమేణా పలచబడి, రాను రాను టక్కున ఆగిపోయాయి! ఎప్పుడేనా వెళితే ఆ సంగతి మినహా మరి అన్ని సంగతులూ మాట్లాడుతారు దంపతులు !

ఆతడికి సంపద హెచ్చింది. ఇక్కడ అదృష్టం కలసి రాలేదు...తెగుళ్లు, అతివృష్టి, అనావృష్టి దోషాలు! ఒక్కోసారి చేసిన మేలు మరచి, అపకారమే తలపెట్టడంలో మృగాలను మించుతారు మానవులు! మానవులకంటే తానేమీ తక్కువ కాదంటుంది ప్రకృతి కూడా! ఆ రేళ్ళు తిరిగేసరికి విశ్వనాథం జీవిత విధానమే తారుమారయింది!

"పార్వతీ!" భర్త పిలుపుతో ఉలిక్కిపడింది పార్వతి. బహుశా భర్త కూడా అంతవరకే గత దృశ్యాలను మననం చేసుకుంటున్నారు కాబోలు!

"అన్నయ్యా, వదిన నిన్న ఏమన్నారో తెలుసా!" చెప్పమన్నట్లు తలవూపింది పార్వతి.

"ఇక్కడమాత్రం ఖర్చులూ అప్పులూ లేవనా నీ ఉద్దేశ్యం ? పెద్దవాడు ఎగిరెగిరి ఫారిన్ వెళ్లాడా ? వాడికి సమస్తమూ నేను జరపాలా ? పిల్లకోసం ఇరవై వేలయినా ఇవ్వంది మన అంతస్తుకు తగ్గ వరుడొస్తాడంటావా ? అసలేమిటోరా విశ్వం! నా దగ్గరేదో డబ్బు పాతరేసి ఉందని మీ అభిప్రాయం...అన్నాడు అన్నయ్య...మాట్లాడలేకపోయాను. నేనాయన స్వార్జితమేమీ కోరలేదుగదా పార్వతీ! కనీసం మనం ఆయనకు అవసరానికి ఆదుకున్నదయినా ఇస్తే మన రామాన్ని వెంటనే కాలేజీలో చేర్చవచ్చని ఆశ పడ్డానంతే!"

పార్వతి మౌనంగా వింటోంది ! ఫస్టు క్లాసులో పాసై, ఇంజనీరింగ్ సీటు కూడా తెచ్చుకున్నాడు పెద్దవాడు రామం! కానీ ఆ చదువు సాగించేదెలా ?

"ఒదినేమందో తెలుసా ?" విశ్వనాథం మళ్ళీ అడిగాడు......

"ఏమందేమిటి ?"

"డబ్బాలో నాలుగు రాళ్ళు పోసినట్లయింది నాయనా మా పని ! మా దగ్గరేదో బంగారం అచ్చులున్నాయనీ, అవే మేము తింటున్నామనీ, అడ్డమైన వాడికీ కన్నుకుట్టే ! ఎంత చెట్టుకంత గాలి...నువ్వే చెప్పు నాయనా ! ఎక్కణ్ణుంచి వస్తుంది ప్రతి వెధవకీ డబ్బు ? అంది. నోట్లోపోసుకున్న పాయసం విషంలా మారిపోయింది...పొర మార్చుకుంటున్నట్లు గ్లాసు కింద పెట్టేశాను...మళ్ళీ ఆవిడే అంది కాకున్నా నువ్వు లేనిపోని బరువులు నెత్తి నేసుకుంటావు ! ఆ మీనాక్షినీ, దాని

కొడుకునూ ఉద్ధరించకుంటే ఏ దేవుడేడ్చాడు ... వాళ్ళ మానాన వాళ్లు బ్రతికేవాళ్లు కాదూ? అంది. విన్నావా పార్వతీ! చిన్నవదిన్నా కష్ట సమయంలో అలా వదిలుంటే బాగుండేదిట !”

నిశ్చేష్టురాలైంది పార్వతి! ఆ మాటలు మహాలక్షమ్మ అన్నదా? తను ఆడదైయుండి అన్నదా? ఈనాటికీ తన రెండో తోటికోడలి కానాడు ఎదురైన దుర్విధి దృశ్యం తన కన్నులముందు నిలుస్తోంది కూడా!

“మరదిగారూ! పెద్దవాణ్ణి డాక్టరు కోర్సులో చేర్చామో లేదో నా రాతిలా మండిపోయింది! అసలే మీ అన్నయ్య గారికీ, మా అన్నయ్యలకూ మొదట్నుంచి పంతాలతో రాకపోకలు లేవాయె! కనీసం ఈ కష్టదశలో కూడా మా వాళ్లు పంతాలు వదులుకోలేదు. ఈ తండ్రి లేనివాణ్ణి ఈ చదువు పూర్తి చేయించుకుంటే ... ఆ తర్వాత నా ఖర్మ నాది...” మీనాక్షి వెక్కిళ్లు ఆపుకోలేకపోయింది!

చిన్న వదిన దుఃఖం విశ్వనాథం హృదయాన్ని రంపపు కోత పెట్టింది! అప్పటికే తన భూములన్నీ అప్పులక్రింద తాకట్టులో ఉన్నాయి! ఎలాగోలా సంసారం నెట్టుకు వస్తున్నాడు గుట్టుగా.

“అమ్మా, పార్వతీ! మన బావగారి సంగతి నీకు తెలుసుగదా! ఎక్కడ మా బరువు వాళ్లనెత్తిమీద పడుతుందోనని ఇటు ముఖం కూడా చూపటంలేదు. ఆ దంపతులు... నే నీ పిల్లలిద్దర్ని ఎలా పెంచాలో, ఏమిటో!” సాటి ఆడదలా

రోదిస్తుంటే కరిగిపోని స్త్రీ అంటూ ఉందంటే ఆమె అడది కాదు, రాయే కావాలి!

"అక్కయ్యా! నువ్వూరుకో అమ్మా! మీ మరదిగా రేదో ఉపాయం ఆలోచిస్తారులే!" అంది ఓదారుస్తూ పార్వతి.

భవిష్యత్తు వేపు భయంగా చూస్తూ, ఏమి చెయ్యటానికీ చేతరాని వయస్సులో, భీతిల్లిన మనస్సుతో, నిశ్చేష్టుడై కూర్చునివున్న పదిహేడేళ్ల గోపీని ... తన రక్తంలో రక్త మయిన అన్న రామనాథం కుటుంబ దీనావస్థను చూస్తూ చలించి పోయాడు విశ్వనాథం...

"వదినా! మీరు దిగులు పడవద్దమ్మా! గోపీ నా బిడ్డనుకోండీరోజునుంచి! తల తాకట్టు పెట్టయినా వాణ్ణి డాక్టరు పరీక్ష పూర్తి చేయిస్తాను..." అన్నాడు విశ్వనాథం.

ఆ నిమిషంలో మీనాక్షి ముఖంలో కనిపించిన కృతజ్ఞత, ఆనందం చూచి, అది తమదిగా అనుభూతి చెందారు విశ్వనాథం, పార్వతి!

అంతే! పార్వతి మెడలోని నగలు ఒక్కొక్కటిగా కనుమరుగై పోయాయి!

"పార్వతీ! నీ నగలు గోపీ చదువుకోసం వెచ్చిస్తున్నా నని బాధగా ఉందా? వాడు రేపీపాటికి డాక్టరై వస్తాడు......ఒకవేళ మనవాడి చదువుకు అంతగా లోటొస్తే వాడు చూసుకుంటాడులే, దిగులుపడకు......" అన్నాడొక సారి విశ్వనాథం...

పార్వతి చిన్నగా నవ్వింది...కానీ ఆ నవ్వులో ఏదో బాధ వద్దన్నా వెలువడింది !

"పార్వతీ ! ఈ ఏటితో వాడి చదువయిపోతుంది. నాలుగురోజుల్లో ఫీజు కట్టాలి...నీ మెడలో చంద్రహారం..." గునుస్తూ అడిగాడు విశ్వనాథం.

"ఈరోజు శుక్రవారం......అదీగాక మెడలో చివరగా మిగిలివున్న నగ ఇదొక్కటే...మనకూ పిల్లలున్నారు... అసుర సంధ్యవేళ..."

పార్వతి హృదయంలోని బాధ కొద్దిగా భాషరూపం లోకి వచ్చిందో లేదో ఛ(రుమన్నాడు విశ్వనాథం...

"ఈరోజు శుక్రవారం...రేపు శనివారం...ఎల్లుండి ఆదివారం...ఆఖరు నగ ! పిల్లలు...ఇన్ని వెధవ కారణాలు చూపించకుంటే, వాడి చదువు ఆపెయ్యండని చెప్పలేక పోయావ్ ! నా అన్నకొడుకు కెక్కడ డాక్టరవుతాడోననే దురాలోచనతప్ప..."

పార్వతి గబుక్కున చంద్రహారం తీసి భర్త చేతిలో పెట్టింది !

"అలాటి ఆలోచనే నాకుంటే నాను, పట్టెడ, వడ్డాణం, వంకీలూ, గాజులూ కూడా ఏదో సాకుతో దాచిపెట్టుకునే దాన్ని..." ఆమె మాటల్లో తానన్ని నగలు ధారపోశాననే సాధింపుకన్న, తనను భర్త అలా శంకించారన్న బాధే ఎక్కువగా ధ్వనించింది.

"పార్వతీ! బాధపడుతున్నావా? కోపం మనిషిని మృగంలా చేస్తుందంటారు, ఇలాటిదే! ఈ ఒక్క సంవత్సరం తిన్నగా వాణ్ణి గట్టెక్కించామంటే, తర్వాత వాళ్ళ తిప్పలు వాళ్ళవి! చనిపోయిన అన్నయ్యకూడా కొంత మనశ్శాంతిని చేకూర్చినవాళ్ళ మవుతామని నా ఆవేదన...బాధపడకూ..." భర్త అనునయిస్తుంటే కరిగిపోయింది పార్వతి! అప్పుడు రామం పదకొండేళ్ళవాడు!

మనసుకున్న వేగం మరి దేనికీ లేదేమో! గొలుసు కట్టులా వస్తున్న గత స్మృతులను అదుపులో పెట్టాలనిపించింది పార్వతికి!

"గోపీకీ, వాళ్ళమ్మకూ కలిపి ఉత్తరం వ్రాశాను పది రోజులక్రితం...కనీసం అప్పుగానైనా ఇవ్వగలిగితే, రామం ఉద్యోగానికొచ్చిం తర్వాత తప్పక తీరుస్తాడని కూడా వ్రాశానందులో..."

విశ్వనాథం మాటలు హాయిగా విన్పించాయి.

"జవాబు వ్రాశాడా?" కుతూహలంగా అడిగింది పార్వతి.

"ఆ! చదివి వినిపించేదా?"

"ఒద్దులెండి....సంగతులు చెప్పండి చాలు...." ఏదో శంక ఆవరించింది.

"ప్రేమించి మరో డాక్టర్ని పెళ్ళి చేసుకున్నాడుగా మన గోపీ! ఆవిడకేమో మన సాంప్రదాయాలూ, పద్ధతులూ నచ్చవట....అంతా ఇంగ్లీషువాళ్ళ పద్ధతట. భార్యాభర్త

లిద్దరూ స్వేచ్ఛగా హాయిగా తమ సంపాద్యంతో జల్సాగా ఉండాలేగానీ, లేనిపోని బాదరబందీలూ బాధ్యతలూ వారి కుండకూడదుట.....అదీ ఆవిడ మతం! 'నాకూ ఆ పద్ధతే మంచిదని తోస్తోంది బాబాయ్ ఆలోచించిచూస్తే! అసలు మా అమ్మదే నాకో పెద్ద బరువై పోయింది! ఆమె చాదస్తాలు ఆమెవేగానీ, కాలానుగుణంగా నడుచుకోవటం చేతరాదు... అందుకే అమ్మనూ, చెల్లాయినీ మా మామయ్య దగ్గరికి పంపించదల్చుకున్నాను......వెళ్ళనంటోందిగానీ.......ఆవిడకేం తెల్సు మా బాధలు?' ఇదీ జవాబు. ఇక మన రామం సంగతేమీ రాయలేదు. వేరే రాయాలా? అర్థం గావటం లేదూ?'' విశ్వనాథం గాఢంగా నిట్టూర్చాడు.

అప్పుడే వాకిట్లో అడుగెట్టిన రామం, తల్లిదండ్రులవేపు నిశితంగా చూస్తూ భుజంమీద నిద్రపోతున్న చెల్లెల్ని మంచం మీద పడుకోబెట్టి, తమ్ముణ్ణి నడిపించుకుంటూ, పెరట్లోకి వెళ్ళి పోయాడు.

అనుకోకుండా పార్వతి భర్తవేపు చూచింది. విశ్వనాథం కూడా ఎందుకో ఆవిడవేపు చూచాడు. ఇద్దరి చూపులూ కలుసుకున్నాయి. ఇద్దరి హృదయాల్లోనూ చిక్కరి బిక్కరిగా, చిక్కగా అల్లుకుని వున్న సమస్య ఒక్కటే? తెలివి తేటలూ, సహనమూ, సమయస్ఫూర్తీ, అన్నీ వున్న ఈ తమ బిడ్డల భవిష్యత్తేమిటి? లక్షుమ్మ అన్నట్లు, తాము అనవసరంగా పరోపకారం చేశారా? హృదయ దౌర్బల్యం అలా చేయించిందా? లేక ఈనాటి ఈ పరిస్థితికి బాధ్యులెవరు? ఏదెలా అయినా ఈ పిల్లల భవిష్యత్తును తామెలా నిర్ణయించి,

మార్గం నిర్దేశించాలి? ఇవే ఆ నిమిషంలో ఇద్దరి హృదయాల్లోనూ రేగిన ఆలోచనలు!

"మనుష్యులు కృతఘ్నులూ, స్వార్థ పూరితులూ కావచ్చు ... కానీ భూమాత కాదు ... దీనికింత ఆలోచనేమిటి? మా పుట్టింటివారు నాకు పసుపు కుంకుమలకుగానూ ఇచ్చిన ఆ రెండెకరాలేగదా మనల్నింతవరకూ పోషిస్తూంది. రామాన్ని వ్యవసాయంలోకి దింపుదాం! భగవంతుడు చల్లగా చూస్తే, అదే చాలు మనకు...ఏ చదువులూ, ఉద్యోగాలూ అక్కర్లేదు..." హఠాత్తుగా ఆవేశంగా అంది పార్వతి అదే నిర్ణయంచేస్తూ.

విశ్వనాథం విస్మయంగా చూచాడామెవేపు.

లాంతరువత్తి పెద్దదిగా ఉన్నందువల్ల కాబోలు మెల్లిగా గ్లాసు కొడిగడుతోంది. పొగచూరి నల్లగా అవుతోంది ... పార్వతి గబుక్కున లేచి వెళ్ళి వత్తి తగ్గించింది.

విశ్వనాథాని కేమిటో కెలికినట్లయింది.

"పార్వతీ!"

భర్త కంఠస్వరంలోని ఆర్ద్రితకు ఉలికిపడింది పార్వతి.

"బహుశా ఈ పరిస్థితులన్నిటికీ కారణం చాలావరకూ నేనే! కదూ? నీకూ, నీ బిడ్డలకూ అన్యాయం చేశానని నన్ను ద్వేషిస్తున్నావు కదూ?"

భర్త కనుకొలకుల్లో నిలిచిన నీటి బిందువులు ఆమె హృదయాన్ని తొలచి వేస్తున్నాయి.

"లేదు ... లేదు ... అలా ఎన్నటికీ అనుకోవద్దు ... మీరు ... మీరు ఈ దీపంలాంటివారు."

ఆశ్చర్యంగా చూచాడు విశ్వనాథం నమ్మలేనట్లు.

అతడి హృదయాన్ని గ్రహించి మళ్ళీ అంది పార్వతి.

"అవును. నిజంగానే చెబుతున్నాను. వెలుగు నివ్వటమే దీపం స్వభావం. ఆ వెలుగు సాయంతో తమ తమ పనులు చేసుకుని, ఆ దీపాన్ని ఆర్పివేయటం మానవ నైజం! అందరికీ వెలుగునిచ్చే దీపం చుట్టూరా కీనీడ ఉండటమూ సహజమే! అయితే ఆ నీడే దీపానికి తోడునీడ కూడా! తన చుట్టూ కీనీడ మాత్రమే ఉందని దీపం వెలుగు నివ్వటం మానుకుంటుందా?"

విశ్వనాథం తప్త హృదయానికి పార్వతి మాటలు పన్నీటి జల్లులా తోచాయి.